చిన్నారుల ప్రాణాలతో చెలగాటం

- ఏఎన్ఎంల కొరతతో ఎంఎల్‌హెచ్‌పీలతో టీకాలు
- అరకొరగా శిక్షణ ఇచ్చి వేయిస్తున్న వైద్యసిబ్బంది

విజమూరు (ఉదయగిరి): వింజమూరు మండల చాకలికొండ పీహెచ్‌సీ పరిధిలోని చిన్నారులు, గర్భిణులకు ఏఎన్ఎంలకు బదులుగా సరైన శిక్షణ లేని ఎంఎల్‌హెచ్‌పీలతో టీకాలు వేయిస్తూ వారి ప్రాణాలతో వైద్యాధికారులు చెలగాటమాడుతున్నారు. ఏఎన్ఎంల కొరతతో ఎంఎల్‌హెచ్‌పీలకు అరకొరగా శిక్షణ ఇచ్చి టీకాలు వేయిస్తున్నారు. ఈ వ్యవహారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని పైస్థాయి నుంచి కింద స్థాయి అధికారుల వరకు తెలిసినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చాకలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పది ఆయుష్మాన్‌భవ ఆరోగ్య కేంద్రాలు (వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు) ఉన్నాయి. వీటిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీఎస్సీ నర్సింగ్ చేసిన వారిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసి మిడిలెవల్ హెల్త్ ప్రొవైడర్ల(ఎంఎల్‌హెచ్‌పీ)గా నియమించింది.వీరు ఆరోగ్య కేంద్రాల పరిధిలోని రోగులకు అవసరమైన వైద్యసేవలు అందించాలి. అయితే వీరితో టీకాలను మాత్రం వేయించకూడదు. చిన్నారులు, గర్భిణులకు ప్రత్యేక శిక్షణ పొందిన ఏఎన్ఎంలే టీకాలను వేయించాలి. కానీ చాకలికొండ పీహెచ్‌సీ పరిధిలో గత కొన్నివారాలుగా వైద్యాధికారులు ఏఎన్ఎంలకు బదులుగా ఎంఎల్‌హెచ్‌పీలతో టీకాలను వేయిస్తున్నారు. ప్రతి బుధ, శనివారాల్లో టీకాలు వేస్తారు. అందులో భాగంగా శనివారం ఊటుకూరు, కాటేపల్లి, బుక్కాపురం, గుండెమడకల, శంఖవరం సచివాలయాల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీలతో టీకాలు వేయించారు. టీకాలు వేసే సమయంలో చిన్నపొరపాటు జరిగినా ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది. ఇంత సున్నితమైన టీకాలను వైద్యాధికారులు ఏఎన్ఎంల కొరత పేరుతో ఎంఎల్‌హెచ్‌పీలతో వేయిస్తూ చిన్నారులు, గర్భిణుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



చిన్నారికి టీకా వేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

వేధింపులు తప్పడం లేదు

ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంఎల్‌హెచ్‌పీలతో టీకాలు వేయించకూడదు. ఈ విషయాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సైతం స్పష్టంగా చెప్పారు. కానీ ఎలాంటి శిక్షణ లేని ఎంఎల్‌హెచ్‌పీలతో వైద్యాధికారులు టీకాలు వేయిస్తున్నారు. చిన్న పొరపాటు జరిగిన ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.ఈ విషయాన్ని వైద్యాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఏదైనా జరగరాని ఘటన జరిగితే తమ ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని ఎంఎల్‌హెచ్‌పీలు వాపోతున్నారు. బలవంతంగా తమతో పనులు చేయించుకోవడమే కాకుండా ఉద్యోగాలను గాలిలో పెడుతున్నారని, గట్టిగా మాట్లాడితే వివిధ రకాలుగా వేధిస్తున్నారని, ఉన్నతాధికారులు కూడా మా గోడు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చాకలికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీకృష్ణను వివరణ కోరగా, తాము స్వయంగా ఎంఎల్‌హెచ్‌పీలకు టీకాలు వేయడంపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. మండలంలో ఆరుగురు ఏఎన్ఎంల కొరత ఉండడంతో వారి సేవలు వినియోగించుకుంటున్నామని చెప్పారు. జిల్లా అధికారుల సూచనల మేరకే వారికి టీకాలు వేసే విధులు అప్పగించామని తెలిపారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సీతారామపురం : మండలంలోని సోంపల్లికి చెందిన గొల్లపల్లి సురేష్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేష్ మరణించిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు నగదును అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్టి రామచంద్రయ్య, పాలకొలను వెంకటరెడ్డి, బాలినేని పెద్ద మాబయ్య, మేడిబోయిన దుగ్గయ్య, డేవిడ్, రమణయ్య, ఖాజావలి, సోంపల్లి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్వోలకు గ్రామాల కేటాయింపు

సీతారామపురం: మండలంలోని వీఆర్వోలకు క్లస్టర్ల వారీగా గ్రామాలను కేటాయించినట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఇటీవల సాధారణ బదిలీలు జరిగి కొత్త వారు వచ్చిన నేపథ్యంలో మారంరెడ్డిపల్లి, గుండుపల్లి, పబ్బులేటిపల్లి, చిన్నాగంపల్లి, పెద నాగంపల్లి గ్రామాలకు మురళి, సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, దేవరాజుసూరాయపల్లి, దేవిశెట్టిపల్లికి వంశీకృష్ణ, నెమళ్లదిన్నె, గంగవరం, జయపురం, దేవమ్మచెరువు, బాలాయపల్లి, వేంపల్లితోకకు బాలయ్య, సీతారామపురం బిట్-1 ఖాజామొహిద్దీన్, బసినేనిపల్లి, పడమటి రొంపిదొడ్లకు కేశవరావు, నారాయణప్పపేట, పండ్రంగి, సీతారామపురం బిట్-2కి జీ మనోహర్‌ను వీఆర్వోలుగా కేటాయించినట్లు వివరించారు. వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను అందించాలన్నారు.

స్వామిత్వపై గ్రామసభ



కలిగిరి: మండలంలోని నాగసముద్రం గ్రామ సచివాలయంలో ఈఓపీఆర్డీ వెలుగోటి మధు ఆధ్వర్యంలో స్వామిత్వపై గ్రామసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామకంఠం పరిధిలోని అన్ని రకాల ఆస్తులను సర్వే చేసి యాజమాన్య హక్కులను నిర్ధారిస్తామన్నారు. అనంతరం యజమానులకు ఆస్తి కార్డులను అందజేస్తామని తెలిపారు. సర్పంచ్ డమ్ము శ్రీనివాసులు, వీఆర్వో హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి



రమణయ్య(ఫైల్)

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం శంఖవరం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ చిలకపాటి రమణయ్య(58) శనివారం ఉపాధి పనులు చేపడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందారు. వడదెబ్బ ప్రభావంతో చనిపోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపాధి పనులు జరిగే చోట కనీస వసతులు కల్పించడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు

కొండాపురం: మండలంలోని కొమ్మి, సత్యవోలు ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు జిల్లా ఫ్లోరోసిస్ అధికారిణి డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ పరీక్షలను శనివారం నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్య సిబ్బందికి ఫ్లోరోసిస్ పరీక్షలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 3,4,5 తరగతుల విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. డాక్టర్లు నస్రుద్దీన్, కవిత, సీహెచ్ఓ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు చోరీపై ఫిర్యాదు

ఉదయగిరి: తన బ్యాగులోని బంగారు నగల చోరీపై వరికుంటపాడు మండలం జడదేవికి చెందిన ఆర్టీసీ కండక్టర్ పులివర్తి రామన్‌జ్యోతి ఉదయగిరి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. వివరాలు..గత నెల 23న వేకువజామున రామన్‌జ్యోతి విధులకు హాజరయ్యేందుకు తన స్వగ్రామం నుంచి విజయవాడ బస్సులో ఉదయగిరి వచ్చారు. బస్సు దిగి బ్యాగు చూసుకోగా అందులోని బంగారు సరుడు కనిపించలేదు. అప్పట్లో ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతన్ని పోలీసులు విచారించగా ఏమీ తేలకపోవడంతో తిరిగి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపడుతున్నట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

మర్యాదపూర్వకంగా..

సీతారామపురం : జిల్లా వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీ పాలగిరి ముద్దు కృష్ణంరాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని సూచించారని పాలగిరి తెలిపారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డీ నాగేశ్వరరావు, హెచ్ఓడీ శివప్రసాద్ తెలిపారు. శనివారం వారు కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిసెట్ ఎంట్రెన్స్ రాయకపోయినా సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్లు పొంది కోర్సుల్లో చేరవచ్చునని తెలిపారు. జిల్లాలోని ఏ పాలిటెక్నిక్ కళాశాలలో లేని ఆటోమొబైల్ ఇంజినీరింగ్ కోర్సు ఆత్మకూరులోనే ఉందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని కోరారు.

ముగిసిన మెగా జాబ్‌మేళా

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా శనివారంతో ముగిసింది. రెండ్రోజుల పాటు నిర్వహించిన జాబ్‌మేళాలో 93 కంపెనీలకు 1200 మంది ఎంపికయ్యారు. వారికి డీఆర్‌డీఏ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జీ సతీష్‌రెడ్డితో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ జాబ్‌మేళా విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సాత్‌జోన్ కంపెనీల కోఆర్డినేటర్లు కన్నన్, శ్రీనివాసన్‌ను అభినందించారు. అనంతరం డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ 20 రోజులకుపైగా శ్రమించి జాబ్‌మేళాను ఏర్పాటు చేసిన వారి కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరాలని కోరారు. జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఇలాంటివి ఏర్పాటు చేసేందుకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బీ పావని, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ఆంజనేయరెడ్డి, తహసీల్దార్ బీ పద్మజాకుమారి, తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు ఎంపికైన అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న ఆనం, సతీష్‌రెడ్డి

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

కావలి (జలదంకి): మువ్వన్నెల జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని కావలిలోని డాక్టర్ ప్రభాకర్‌నాయుడు ఆస్పత్రిలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి డాక్టర్ ప్రభాకర్‌నాయుడుతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్‌రావు, రాయపాటి దిలీప్‌కుమార్, మొఘల్ సలీమ్‌బేగ్, ఘనీబాషా, జీ సురేంద్ర, మధుసూదన్‌రావు, ఖాదర్‌బాషా, నందిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పింగళి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పింగళి వెంకయ్య గొప్ప దేశభక్తుడు అన్నారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని రూపొందించి తెలుగువారి కీర్తిని దేశానికి చాటి చెప్పారని కొనియాడారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు మహేష్ , ధనుంజయ, రమణరాజు, మదీనా, మాధవి, నాగ మురళి, పెద్దయ్య పాల్గొన్నారు.



సోమశిల: జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

వింజమూరు(ఉదయగిరి): ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద 50శాతం రాయితీపై అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించిందని జాయింట్ కలెక్టర్ బీవీ కార్తీక్ తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గస్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ పథకంపై అధికారులు, లేఅవుట్ల యజమానులు, రాజకీయ నేతలకు స్థానిక ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌లో చేరని లేఅవుట్ల జాబితాను గుర్తించి నిషేధిత భూముల రిజిస్టర్‌లో నమోదు చేశామన్నారు. భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరగదన్నారు. క్రయ, విక్రయాలు కూడా నిలిపివేశామని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రతి ప్లాటుదారుడు తమ ప్లాటుకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలో ఏడు శాతం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. నుడా చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో నుడా ద్వారా లేఅవుట్‌లు వేసి సరసమైన ధరలకు ప్లాట్లు విక్రయిస్తామని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో నుడా ఆధ్వర్యంలో పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆర్డీఓ వంశీకృష్ణ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కారును ఢీకొన్న కాంక్రీట్ మిక్సర్

కావలి (జలదంకి) : కావలి మండలం ముసునూరు టోల్‌గేట్ సమీపంలో శనివారం సాయంత్రం కాంక్రీట్ మిక్సర్ అదుపుతప్పి కారును వెనుకగా ఢీకొంది. కారు డివైడర్‌ను ఢీకొని ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాలు...కావలికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అఖిల్ తన భార్య, పిల్లలతో కలిసి కారులో శనివారం ఉదయం నెల్లూరులోని అత్తారింటికి వెళ్లాడు. అక్కడ భార్య, పిల్లలను దించి తన స్నేహితునితో కలిసి కావలికి బయలుదేరాడు. ఈ క్రమంలో ముసునూరు టోల్‌గేట్ సమీపంలో కారును వెనుకగా కాంక్రీట్ మిక్సర్ ఢీకొంది. దీంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. కారులో ఉన్న ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు: దుత్తలూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. ఆర్డీఎస్ పనులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

అల్లూరు: మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు టౌన్ ఏఈ షేక్ మస్తాన్ శనివారం తెలిపారు. విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులకు అండగా ఉంటా

కావలి (జలదంకి) : కావలి నియోజకవర్గంలోని ప్రతి రైతుకు అండగా ఉంటానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కలయిక కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతుల ఖాతాల్లో తొలి విడతగా రూ.7వేలు నగదు జమచేస్తున్నట్లుగా తెలిపారు. కావలి నియోజకవర్గానికి సంబంధించిన రైతుల ఖాతాల్లో రూ.12.35 కోట్లను జమ చేస్తున్నట్లుగా వివరించారు. అనంతరం అధికారులతో కలిసి నమూనా చెక్కును ఆవిష్కరించారు.. ప్రకృతి వ్యవసాయ శాఖ డైరెక్టర్ రాజశేఖర్, వ్యవసాయశాఖ కావలి ఏడీఏ నాగరాజు, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ వైద్య శిబిరం నేడు

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీ సాయిరాం కళాశాల ఆవరణలో నెల్లూరుకు చెందిన డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సహకారంతో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ నాయకులు శనివారం తెలిపారు. నెల్లూరు రామచంద్రారెడ్డి ఆస్పత్రి వైద్యులు ఎంవీ రమణయ్య, మెడికవర్ ఆస్పత్రి గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం బాలకృష్ణ రోగులకు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. తక్కువ ధరకే రెండు నెలలకు సరిపడా షుగర్, బీపీ మందులను అందజేస్తారని తెలిపారు.

ధ్యానంపై ఉచిత శిక్షణ నేడు

ఆత్మకూరు: పట్టణంలోని షిర్డీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం నిర్వాహకులు శనివారం తెలిపారు. పట్టణంలోని కాశీనాయన ఆశ్రమ ప్రాంగణంలో ప్రముఖ పిరమిడ్ మాస్టర్ ప్రకృతి ఉమామహేష్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ధ్యానంపై శిక్షణ ఇస్తానని చెప్పారు. పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు రేపు

సంగం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో మిగిలి ఉన్న ఖాళీల భర్తీకి సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుమతమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ–2లో 10, ఎస్సీ–3లో 4 ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తనతో పాటు తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, తల్లి బ్యాంక్ ఖాతా పుస్తకం మొదటి పేజీ, రేషన్‌కార్డు జెరాక్స్‌లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలని కోరారు.

ప్రత్యేక గ్రీవెన్స్ రేపు

ఉదయగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎల్ రామ్మోహన్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక గ్రీవెన్స్‌కు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆత్మకూరు ఆర్డీఓ పావని, అన్ని శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీటీ షాజియా, వీఆర్వోలు మాలకొండయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం రేపు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఇరిగేషన్ సచివాలయంలో సోమవారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ శనివారం తెలిపారు. ఆధార్‌కు సంబంధించిన అన్ని సేవలను అందించనున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిలో పొగాకు సగటు ధర రూ.205

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు సగటు ధర రూ.205.25 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 313 బేళ్లను తీసుకురాగా, 157 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.205.25 లభించిందని వివరించారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

మర్రిపాడు: మండలంలోని ఐదు మద్యం దుకాణాలను ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై దీప్తి కారంత్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

సోమశిల: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఆత్మకూరు డివిజన్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అల్లంపాటి మహేష్ డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఈ నెల 7న చేపడుతున్న చలో విజయవాడ–విద్యుత్ సౌధ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను అనంతసాగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమను పర్మినెంట్ చేయాలని పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో పీఆర్సీ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులకు అరియర్స్ ఇస్తామని ఒప్పందం చేసుకుని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న అదానీ స్మార్ట్‌మీటర్లతో మీటర్‌రీడర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న చలో విజయవాడ–విద్యుత్ సౌధ ముట్టడి కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు, విద్యుత్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఓంకారం, వెంకటేశ్వర్లు, వసీం, ఆశిక్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



చలోవిజయవాడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా బళ్లారి రాఘవ జయంతి

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో నాటకరంగ ప్రముఖులు బళ్లారి రాఘవ జయంతి వేడుకను అసోసియేట్ డీన్ డాక్టర్ జీకృష్ణారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించిన రాఘవ తెలుగు నాటక రంగ ప్రముఖులుగా, ప్రముఖ న్యాయవాదిగా ప్రసిద్ధి చెందారన్నారు. ఆయన ప్రతిభను గుర్తించి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం రావు బహద్దూర్ అన్న బిరుదును ఇచ్చి సత్కరించిందన్నారు.తన సమయాన్ని, సంపదను నాటక రంగ పురోగతి కోసం ధారాళంగా వెచ్చించారన్నారు. తెలుగు, కన్నడ, ఇంగ్లిష్, హిందీ భాషలు అన్నింటిలోనూ రాఘవ ప్రదర్శనలు ఇచ్చారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆంధ్ర కళాప్రపూర్ణ బిరుదుతో ప్రజలు, సంస్థలు ఆయనను సత్కరించాయన్నారు. ప్రొఫెసర్లు జీ రమేష్, టీ గోపికృష్ణ, రఘునాథరెడ్డి, సునీత, కిషన్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే ధ్యేయం

వింజమూరు(ఉదయగిరి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతగా రూ.7వేలు నగదును రైతులకు అందజేస్తోందని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో 44 వేల మంది రైతులకు సంబంధించి రూ.30 కోట్లను వారి ఖాతాల్లో జమచేస్తున్నట్లుగా వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ వంశీకృష్ణ, ఏడీఏలు ఎం శేషగిరిరావు, జీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే, జేసీ

తల్లిపాలు అమృత తుల్యం



ఆత్మకూరులో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు



ఉదయగిరిరూరల్ : తల్లులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి వినీత

కావలి (జలదంకి): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ కావలి ప్రాజెక్ట్ సీడీపీఓ సౌజన్య అన్నారు. కావలిలోని ముసునూరు అంగన్‌వాడీ కేంద్రాల సముదాయంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై తల్లులకు అవగాహన కల్పించారు. తల్లి ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, అంగన్‌వాడీలు శివలీల, రమాదేవి, ప్రభావతి, సుశీలకుమారి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: మండలంలోని బోడిసత్రం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీ పద్మావతి పాల్గొన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని తెలిపారు. తల్లులకు రొమ్ము కేన్సర్ రాదన్నారు.

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆత్మకూరు సీడీపీఓ సునీలత పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం పౌష్టికాహారాన్ని పదర్శించారు. కౌన్సిలర్ శ్రీనివాసులు నాయుడు, సూపర్‌వైజర్ కస్తూరి, అంగన్‌వాడీలు వేణుకుమారి, మస్తానమ్మ, వాణి, లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.

సీతారామపురం : అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజరు షేక్ షాను పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించి పోస్టర్లను ఆవిష్కరించారు. అంగన్‌వాడీలు లక్ష్మీదేవి, రత్తమ్మ, మస్తాన్‌బీ, రాధ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని కృష్ణంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి వినీత పాల్గొన్నారు. బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టాలని, ఆరు నెలల నుంచి అనుబంధ పోషకాహారాన్ని అందించాలని తల్లులకు సూచించారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం తక్కెళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో డాక్టర్ కే మురళీధర్ పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య బోధకులు కె.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: గుంపర్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీ శ్రీదేవి అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గుంపర్లపాడు ఎంపీపీఎస్ స్కూల్ హెచ్ఎం షేక్ అహ్మద్‌షరీఫ్, ఎంఎల్‌హెచ్‌పీ వీ మంజుల పాల్గొన్నారు.